# సాల్గవ ప్రసంగము.

రాత్రి తొమ్మిదిగంటలు అయినది. ప్రసంగవశాత్తు శ్రీనిత్యానందస్వామివారు శ్రీప్రకాశానందస్వామివారిని ప్రశ్నించిరి. ఈ వేషముతో నుండుటవలన తమకు అన్నపానములకు కష్టము కల్గుచుండవచ్చును.

## త్యాగియొక్క ధర్మము.

స్వా॥ ప్ర॥ :—పూర్వము కాషాయవస్త్రములు ధరించినంతకాలము మధుకరమో, ఎవరి ఇంట అయినను భిక్షచేయుటయో జరిగెడిది. కాషాయములు విసర్జించినది మొదలు పిచ్చివాడనుగానో, ముష్టివాడనుగానో చలామణి అగుచున్నాను.

## మననస్వభావము కల మునియొక్క ధర్మము.

స్వా॥ ని॥ :—అప్పుడప్పుడు ఆకలితో నుండవలసిన పరిస్థితులు మీకు కలుగలేదా?

స్వా॥ ప్ర॥ :—ఎప్పుడైనను ఆకలితో ఉన్నను, ఇప్పటివరకు రెండురోజులకంటె నెక్కువ ఆకలితో నుండవలసిన స్థితి కలుగలేదు. మూడవరోజున ఆహారము దొరకెడిది.

స్వా॥ ని॥ :—ఆకలిగా నున్నప్పుడు నిదిధ్యాసనకు విఘ్నము కలుగలేదా?

స్వా. ప్ర. :—ఆహారము లేనందున మనస్సు బాధపడుచుండెడిది. వృత్తి ఏకాగ్రతను చెందుటకు బదులు స్తబ్ధమయి మూఢత్వమును చెందుచుండెడిది.

స్వా॥ ని॥ :—అప్పుడు మీకు దుఃఖము కలిగెడిది కాదా?

స్వా॥ ప్ర॥ :—ఎరిగియుండి అట్లు చేయుటవలన నాకు దుఃఖము కలిగెడిది కాదు.

స్వా॥ ని॥ :—ఇద్దరు ఫకీరులు ఉండిరి. ఒకడు వృద్ధుడు, ఒకడు యువకుడు. వృద్ధుడు యువకుని అడిగెను. "నీకు అన్నముదొరకనప్పుడు నీకేమగును?" అప్పుడు అతడు జవాబుచెప్పెను. "దేవుడు నాయందు ఈరోజు దయ చూపలేదనిపించును." అనంతరము యువకఫకీరు వృద్ధఫకీరును అడిగెను. "మీకు అన్నము దొరకనిరోజున ఎట్లు తోచును?" వృద్ధుడు జవాబు చెప్పెను— "నేడు దైవము నాయందు దయజూపెను" అనుకొనెదను. ఏలనన, నాకు మనోనిగ్రహమునకు వలయు అవకాశమును ఇచ్చెను."

ఒక మహమ్మదీయ మహాత్ముని చరిత్రమునందు ఇట్లు వ్రాయబడినది. "అన్నము దొరకనప్పుడు దైవము నాకు ఉపవాసమును కానుకగా నొసగెనని అంతరాత్మకు తట్టును. ఉపవాసము చేసిన రోజున నాకు కలుగులాభము భుజించినరోజున కలిగినట్లు తోచదు. ఏలనన, ఉపవాసదివసమున మనస్సు స్వస్థతతోనుండి సాధనయందును, భజనయందును ఎంతయో ఆనందము కలుగును."

స్వామివారి సంగతికూడ ఇట్టిదే. రుచికొరకు భుజించక, శరీర పోషణమునకు ఆహారమును గ్రహించుటలో తప్పు లేదు. భాగవతము నందు ఇట్లు చెప్పబడినది :—

ప్రాణవృత్త్యైవ సంతుష్యేన్మునిర్నైవేన్ద్రియప్రియైః ।
జ్ఞానం యథా న నశ్యేత నావకీర్యేత వాఙ్మనః ॥

"మననస్వభావముకల ముని శరీరనిర్వాహణమునకు చాలినంత ఆహారముతో సంతుష్టిపడవలెను. ఇంద్రియములకు ప్రియములగు విషయములను సేవించరాదు. అట్లు చేయుటవలన జ్ఞానము (వివేకము) నశించదు. మనోవాక్కులు స్ఖలనము చెందవు."

శాస్త్రములందు ఇట్లు చెప్పబడినప్పుడు కష్టములను సహించవలసిన అవసరమేమి?

స్వా॥ ప్రి॥ :—సర్వసిద్ధాంతసార సంగ్రహమున శంకరభగ వాన్లచే ఇట్లు చెప్పబడినది.

## తితిక్ష

సాధనేష్వపి సర్వేషు తితిక్షోత్తమ సాధనమ్ ।
యత్ర విఘ్నాః పలాయన్తే దైవికా అపి భౌతికాః ॥

"సాధనము లన్నిటియందును తితిక్ష ఉత్తమమైన సాధనము. అతని సమీపమునకు దైవికములును భౌతికములును అగు విఘ్నములు చేరవు."

ఒకమారు భర్తృహారికి ఆరురోజులవరకు అన్నము లభించ లేదు. అయినను ఆయనకు, రాజ్యసుఖము తృణప్రాయముగా త్యజించి నందున, దైన్యము ఏమాత్రమును కలుగలేదు. ఆరవరోజున ఆయన తిరుగుచు తిరుగుచు శ్మశానమునకు వెళ్ళిరి. అక్కడ ఒక శవదహనము జరిగి కొంచెము అగ్నికణములు మిగిలియుండెను. భర్తృహారి ఆ అగ్నికి సమీపమున ఉన్న మూడు పిండిముద్దలను తీసికొని ఆ అగ్నిలో పడవేసి రొట్టెలులాగ కాల్చెను. ఆయన రొట్టెలు కాల్చుచున్నపుడు శంకరుడును, పార్వతియును, ఆకాశమార్గమున విమానముతో సంచారము చేయుచు అచ్చటికి వచ్చిరి. శంకరుడు భర్తృహారికి నమస్కారము చేసెను. ఇదిగాంచి పార్వతి మీరు ఎవరిని నమస్కరించుచున్నారు' అని అడుగగా భర్తృహారిని జూపుచు 'అతనికి నమస్కరించుచున్నాను' అని శంకరుడు చెప్పెను. 'నాకు అతనిని చూడాలని ఉన్నది' అని పార్వతి అనగా, ఆయన దర్శనము చేయ దలచి ఇరువురును విమానమునుండి దిగి భర్తృహారి మహారాజు రొట్టెలు కాల్చుస్థలమునకు వెనుకవైపునుండి వచ్చిరి. శంకరుడు 'భిక్షాం దేహి' అని యడిగెను. ఈశబ్దమును విని భర్తృహారి మ్ముఖము నెత్తకుండ చేతితో రొట్టెలను తీసి తన వీపువైపునుండి అతి

థికి అందించెను. ఆసమయమున పార్వతి చెప్పెను. "శంకరభగవానుడు సాక్షాత్తుగా నీవెనుకవైపున నున్నాడు? నీకు కావలసిన వరమును కోరుకొనుము." భర్తృహరి చెప్పెను— "స్వామీ! తమరు ఇచ్చటనుండి దయచేసి వెడలిపోవుటయే నాకోరిక." ఇది విని శంకరుడు, తానుకూడ ఉపేక్షింపబడినందులకు నవ్వసాగెను.

స్వా॥ ని॥ :—భర్తృహరి మున్నగువారు ప్రారంభావస్థలో ఇట్టి తితిక్షతో నుండుచుండిరి. కాని చివరివరకు ఇట్లుండ నవసరము కలుగదు. ఇప్పుడు కొందరు చాంద్రాయణాది వ్రతములు చేయుదురు. నలుబది రోజులు ఉపవాసము చేయుదురు. అందువలన శరీరము శుష్కించుట మాత్రము జరుగును. కాని మనస్సునందలి రాగద్వేషములు నశించవు. శారీరిక తపస్సు జడబుద్ధికికాని తమవంటి వారికి కాదు.

*జడా స్తపోభిః శోషయన్తి దేహం, బుధా మనశ్చాపి వికారహేతుమ్।*
*శ్వా ముక్తమస్త్రం దశతీతి కోపాత్ క్షేప్తారముద్దిశ్య హినస్తి సింహః॥*

జడబుద్ధులు శారీరిక తపస్సుచే శరీరమును కృశింపజేయుదురు. బుద్ధిమంతులు సర్వవికారములకు కారణభూతమగు మనస్సును శమింపజేయుదురు. ఆయుధము ప్రయోగింపబడగా కుక్క కసిదీర్చుకొనుటకు దానిని కరచును; సింహము కోపముతో ఆయుధమును ప్రయోగించిన వానిపైకి ఉరికి వానిని చంపును.

## దేహాధ్యాసము

స్వా॥ ని॥:—"మీకెప్పుడైనా దేహాధ్యాసము స్ఫూర్తికి వచ్చుచుండునా?"

స్వా॥ ప్రే॥ :—నేను సన్యాసమును తీసుకొను రోజులలో ఒకప్పుడు శ్రీమద్భాగవతము ఏకాదశస్కంధము చదువుచుంటిని. ఉద్ధవుడు భగవానుని ప్రశ్నించెను. "కశ్ఛిమ్ముక్షః?" ఋడు

ఎవడు? భగవానుడు సమాధానము చెప్పెను. "మూర్ఖో దేహాద్యహం బుద్ధిః" దేహమునందు అహంబుద్ధి కలవాడు మూర్ఖుడు. అప్పుడే నాకు నేను మహా మూర్ఖుడనని తోచెను. అప్పటినుంచి ఇప్పటివరకు నేను దేహాధ్యాసము పోగొట్టుటకు ఎంతయో ప్రయత్నించుచున్నాను. అభ్యాసముమాట అటుంచండి, దేహమందు వైరాగ్యముకూడ కలుగలేదు."

అక్కడనే కూర్చొనిఉన్న వైద్యరాజ గోపాలజీ భాయి చెప్పసాగెను—"ఈ స్వామివారు విరక్తునివలెనే కనపట్టుచున్నారు."

స్వా॥ ప్ర॥ :—ఒక జైనముని చెప్పెను.

*వైరాగ్యరఙ్గః పరవఞ్చనాయ,*
*ధర్మోపదేశో జనరఞ్జనాయ।*
*వాదాయ విద్యాధ్యయనం చ మేఽభూత్*
*కియత్ బ్రువే హాస్యకరం స్వామీశ॥*

"నా వైరాగ్యవేషము ఇతరులను మోసగించుటకు, ధర్మోపదేశము జనుల మనస్సులను రంజింపజేయుటకు, విద్యాభ్యాసము వాదము చేయుటకు, ఓ పరమాత్మా, హాస్యాస్పదమగు నాసంగతిని ఎంత చెప్పగలను?"

స్వా॥ ని॥ :—తమరు చెప్పినది అసత్యము కాదా?

స్వా॥ ప్ర॥ :—నేను పూర్తిగా అబద్ధాలకోరును. అందుచేతనే ఈజన్మచక్రములో తిరుగుచున్నాను.

స్వా॥ ని॥ :—ఒక భక్తుడు ఉండెను. అతడు గ్రామమునందు భక్తవరునివలె పూజించబడుచుండెను. ఒకరోజున ఒకనూతివద్దనుండి ఆ భక్తవరుడు వెళ్ళుచుండెను. అప్పటికి ఒకామె నీరు తోడుకొనుటకు వచ్చెను. ఆమెభర్త ఆ భక్తవరుని సత్సంగమున జేరి సకల గృహసౌఖ్యములను విసర్జించెను, సాధువులను సేవించుచు, సత్సం

గ్రహము చేయుచు కాలక్షేపము చేయుచుండెను. కావున ఆమెకు భక్తవరునియందు ద్వేషభావము పెరిగియుండెను. ఆమెకు ఆభక్తవరుని చూచినతోడనే అపరిమితమగు కోపము వచ్చెను.

"ఓరీ, భక్తుడా, నీవు భక్తుడవు కాదు, పచ్చి దొంగవు. ప్రజలను నీవు మోసముచేసి భక్తులనుగా మార్చుచున్నావు." ఆ మహా భక్తుడు వినయముతో చేతులు జోడించి చెప్పసాగెను—

"అమ్మా, తమరే నన్ను బాగుగా గుర్తించిరి. ప్రపంచములో నితరులు ఎవ్వరు గుర్తించలేదు. నేను దొంగను కానిచో ఈ జన్మ చక్రములో ఎందుకు తిరుగుదును?"

ఇది విని ఆమె తనలోతాను సిగ్గుపడెను. ఇటులనేస్వామి వారు నన్ను సిగ్గుపరచిరి.

గోపాల:—సత్పురుషులు తమలో తాము కలసికొనినప్పుడు నేర్చుకొనుటకు చాలవిషయములు లభించును.

స్వా॥ ప్ర॥:—*గర్వం నోద్వహతే న నిన్దతి పరం నో భాషతే నిష్ఠురమ్,*
*శ్రుత్వా కావ్యమలక్షణం పరకృతం సన్తిష్ఠతే మూకవత్।*
*ఉక్తం కేనచిదప్రియం చ సహతే క్రోధం చ నాలమ్బతే,*
*దోషాంశ్ఛాదయతే గుణాన్నిగమతే చైతత్ సతాం లక్షణమ్॥*

"సత్పురుషుడు గర్వపడడు. ఇతరులను నిందించడు. ఎవరితోను కఠోరముగా మాట్లాడడు. ఇతరులు రచించిన లక్షణరహితమైన కావ్యమును వినియు కూడ ఏదోషమును చూపకుండ, మూగవానివలె ఊరకుండును. అప్రియవాక్యములు పలికినను, క్రోధమును పొందడు. ఇతరుల దోషములను కప్పిపుచ్చును. వారి గుణములను మాత్రము ప్రకటించును. ఇదంతయు సత్పురుషుల లక్షణము." వీనిలో ఒక లక్షణముకూడ నాయందు లేదు. ఈలక్షణములన్నియు శ్రీనిత్యానందస్వాములవారియందు ఉన్నవి.

గోపాల:—సాధువులు, సంతులు, లేక తమవంటివారు ఎవరైన దయచేసినచో శ్రీస్వామివారివద్ద ఏదైనా ఉపదేశము వినుటకు లభించును. లేనిచో వారు లోపల తలుపువేసుకొని కూర్చొనెదరు. బయట తాళము వేసియుండును. మొట్టమొదట నిత్యానంద స్వామివారు దయచేసినప్పుడు రాజుగారు రాజభవనములో పురాణకాలక్షేపము చేయమని చెప్పిరి. స్వామివారు నాకు పురాణము చెప్పుట రాదని చెప్పిరి.

స్వా॥ ప్ర॥ :—స్వామివారికి పురాణములందు మహాప్రజ్ఞ కలదు. అందుచే వారు పురాణమును చెప్పనన్నారు.

ఒకరాజు ఉండెను. వారి చెంత ఒక శాస్త్రిగారు పురాణము చెప్పుచుండిరి. ఒకప్పుడు గీతాప్రవచనము చేయుచు ఇట్లు చెప్పెను—

*అనన్యాశ్చిన్తయన్తో మాం యే జనాః పర్యుపాసతే ।*
*తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్ ॥*

"నన్ను అనన్యభావముతో స్మరించుచు, నన్ను ఉపాసించుచు నిత్యము నాయందే నిమగ్నమైన చిత్తముకలవాని యోగక్షేమమును నేను వహించెదను."

ఈశ్లోకమును అతడు వ్యాఖ్యానించెను. అదివిని రాజుగారు శాస్త్రిగారితో నిట్లనిరి. ఈశ్లోకముయొక్క అర్థము నాకు బోధపడ లేదు. అంతట శాస్త్రిగారు అనేక విధములుగా వివరించి చెప్పిరి. అయినను రాజుగారు తనకు తెలియలేదని చెప్పిరి. శాస్త్రిగారు చిన్న పుచ్చుకొని ఖేదముతో ఇంటికి వెళ్ళిపోయిరి. చింతించుచుకూర్చొనిరి.

ఇది గాంచి భార్య ఆయనను అడిగెను. 'మీరు నేడు ఇంత విచారముతో ఎందుకు ఉన్నారు?' శాస్త్రిగారు చెప్పిరి—నీకేమి చెప్పుదును? నేను ఇంత గొప్పవిద్వాంసుడను. సకలశాస్త్రపారంగతుడను. నేటివరకు శాస్త్రార్థమునందు ఎంత పెద్దవిద్వాంసుడైనను నాఎదుట

నిలబడలేదు. కాని నేడు గీతయందలి సామాన్యశ్లోకమునకు అర్థము నాకు తెలియదని రాజుగారు సభలో నన్నవమానించిరి.”

భార్య:—“ఏశ్లోకము? ఎందుకు సంబంధించినది?”

శా:—“నీవు అడుగుట ఎందులకు? నీకు తెలియునా?

ఆమె వినయముతో ప్రార్థించెను. “నాకు చెప్పుటకేమైనా అభ్యంతరముకలదా?”

అంతట శాస్త్రిగారు ఆమెకు ఆశ్లోకమును తెలిపిరి. అది విని ఆమె ఇట్లనెను :—

“రాజుగారు నిజము చెప్పిరి.”

శాస్త్రిగారు క్రోధముతో పలికిరి—

“నీవు కూడ అటులనే అనుచున్నావా?”

భార్య:—మీకు అర్థము సరిగా తెలిసినచో రాజుగారివద్దకు పురాణము చెప్పుటకు ప్రతిరోజు వెళ్ళుటకు కారణమేమి? నన్ను అనన్యభావముతో స్మరించువాని యోగక్షేమములు నేనే వహింతును అని భగవానుడు చెప్పినాడు కదా!

శాస్త్రిగారు కండ్లు తెరచిరి. “ఆ, అవును, నిజమే. తప్పు నాది.”

తరువాతిరోజున ఆయన కథ చెప్పుటకు వెళ్ళలేదు. రాజుగారు ప్రధానిని పంపి రాకుండుటకు కారణ మరయగోరెను.

శాస్త్రిగారు ఇట్లు జవాబు చెప్పిరి. “నేటినుండి నేను కథకు రానవసరములేదు. భగవానుడే నాకు సమస్తమును కలుగజేయును. రాజుగారితో నాకు పనియేమి?” ప్రధాని అది రాజుగారికి చెప్పెను. ఆరోజునుండి రాజుగారు ప్రతిదినము ప్రాతఃకాలము కథవినుటకు శాస్త్రిగారి ఇంటికి వెళ్ళసాగిరి.

అదేప్రకారము గీతాదిగ్రంథముల రహస్యము స్వామివారు పూర్తిగా తెలుసుకొనిరి. ఇక వారు దర్బారులో కథ చెప్పుటకు ఎందుకు వెళ్ళెదరు?

గోపాల:—దర్బారులోనికి వెళ్ళకపోతే పోయారు. ఆసనము స్వీకరించి రెండుమాటలు వినిపించుటకు అభ్యంతరమేమి కలదు?

స్వా॥ ప్ర॥ :—శ్రుతియందు చెప్పబడినది—

*తమేవ ధీరో విజ్ఞాయ ప్రజ్ఞాం కుర్వీత బ్రాహ్మణః।*
*నానుధ్యాయాత్ బహూన్ శబ్దాన్ వాచో విగ్లాపనం హి తత్॥*

"ధీరుడగు బ్రాహ్మణుడు బ్రహ్మమును (పరోక్షముగా) తెలిసికొని, ఆ బ్రహ్మతో ప్రజ్ఞను (వృత్తిని) మేళవింపవలెను. ఎక్కువగా శాస్త్రాభ్యాసము చేయనవసరములేదు. అందువలన నోరు నొప్పి పెట్టుట తప్ప వేరొక ప్రయోజనము లేదు."

వాగాది ఇంద్రియముల వ్యాపారములవలన చిత్తైకాగ్రతకు భంగము వాటిల్లును. అందుచే పవిత్రమైన శ్రుతి ఇంద్రియప్రవృత్తులను నిషేధించినది. ఇంద్రియప్రవృత్తి ఉన్నంతకాలము చిత్తమునకు ఏకాగ్రత ఎట్లు కలుగును?

గోపాల :—తమరు చెప్పినవన్నియు సాధకుని విషయములో సత్యము. కాని స్వామివారు ఆరూఢపురుషులు. వీరికి పురాణము చెప్పుటకు అభ్యంతరము ఎందుకు?

స్వా॥ ప్ర॥ :—అధికారికి తప్ప మిగిలినవారికి ఉపదేశము చేయుట వ్యర్థము. అందుచేతనే సంతులు ఎక్కడ పడితే అక్కడ ఉపదేశము చేయరు. వారు తమ స్వరూపమునందే మగ్నమయి ఉందురు.

జడభరతుని జనులు పిచ్చివాడనుకొనుచుండిరి. ఆయన ఎవరికి ఏమియు చెప్పెడివాడును కాడు. కాని రహూగణరాజును అడవిలో కలిసినప్పుడు ఆతని వినయపూర్వకసంభాషణనుబట్టి ఉపదేశార్హతను గమనించి యా ఉపదేశించెను. ఉపదేశించుటకు కాసి, ఉపదే

శించకుండుటకు కాని సంతులకు ఏమియు పట్టుదల ఉండదు. సంతు పురుషుని సమాగమమాత్రముననే ఉపదేశము లభించును.

భర్తృహరిమహారాజు చెప్పెను :—

*పరిచరితవ్యాః సన్తో యద్యపి కథయన్తి న సదుపదేశమ్।*
*యాస్తేషాం స్వైరకథాస్తా ఏవ భవన్తి శాస్త్రాణి॥*

"సంతులు ఉపదేశము చేయకపోయినను వారిని సేవించవలెను. వారి స్వేచ్ఛాసంభాషణలే శాస్త్రరూపమును పొందును."

స్వా॥ ని॥ :— పురాణాదికాలక్షేపములుచేయుట పండితునిపని.

స్వా॥ ప్ర॥ :—తమరే పండితులని నాకు తెలియును.

*యస్య సర్వే సమారంభాః కామసంకల్పవర్జితాః।*
*జ్ఞానాగ్నిదగ్ధకర్మాణం తమాహుః పణ్డితం బుధాః॥*

ఎవనిచే నారంభింపబడు సకలకర్మలును కామసంకల్పముచే విడువబడియుండునో, జ్ఞానాగ్నిచే దగ్ధముగావింపబడినకర్మలు (వాసనలు) గల వానిని 'పండితుడు' అని విద్వాంసులు అందురు.

గోపాల :— *విద్యావినయసంపన్నే బ్రాహ్మణే గవి హస్తిని।*
*శుని చైవ శ్వపాకే చ పణ్డితాః సమదర్శినః॥*

"పండితులు, విద్యావినయములుకల బ్రాహ్మణుడు, ఆవు, ఏనుగ, కుక్క, చండాలుడు— వీని అన్నిటియందు సమానదృష్టిని కగిలియుందురు."

తమరు స్వామివారిని పండితులనుచున్నారు. తమరు అందరియందు సమభావమును కలిగియున్నారు. మరి తమరు పండితులు కారా?

స్వా॥ ప్ర॥ :—ఒక పండితుడు ఒకగ్రామమునందలి మందిరములో గీతాకాలక్షేపము చేయుచుండెను. వారిద్ద[illegible]ధకు చాలమంది వినుటకు వెళ్ళుచుండిరి. ఒకరోజున ఒక మంగలి [illegible] వెళ్ళెను.

అప్పుడు "విద్యా వినయసంపన్నే" అను ఈ శ్లోకము వచ్చెను. ప్రతి విషయమునందును సమానదృష్టి కలిగియుండవలెనని ఎంతో శ్రమపడి పండితుడు శ్రోతలకు చెప్పెను. అది విని మంగలి నేటినుండి సర్వసమ భావము కలిగియుండవలెనను నిర్ణయము చేసికొనెను. అతడు రెండవ రోజున గ్రామములోనికి వచ్చెను. అతడు ఒక బ్రాహ్మణునికి క్షౌరము చేయుచుండగా నొక అస్పృశ్యుడు వచ్చి, నాకు ఎవ్వరును క్షౌరము చేయుటలేదు. నీవు చేయుదువా? అని అడిగెను. "తప్పక చేయుదును, నాకు బ్రాహ్మణుడును అస్పృశ్యుడును సమానమే" అనెను. అతనికి క్షౌరము చేయుచుండగా నొకడు వచ్చి నా దున్నపోతునకు బొచ్చు పెరిగిపోయినది. కత్తిరించెదవా?" అనెను. మంగలి చెప్పెను. "నాకు మనుష్యుడు, పశువును రెండును సమానమే."

అతడు మనుష్యునికి క్షౌరముచేసినటులనే ఆపశువునకుకూడ చేసి ముఖమునకుకూడ అందము రప్పించుటకు ప్రయత్నించెను.

మానవుడు:—"ఇదేమిటి? పశువు బొచ్చు కత్తిరించుటకు ఇంత ఆడంబరము చేయుచున్నావేమి?" అని అడిగెను. "నేను సమదర్శిని. నాకు మనుష్యుడును, పశువును సమానమే. మనుష్యునికి క్షౌరము చేసినట్లుగనే పశువునకుకూడ క్షౌరము చేయుదును" అని అనెను. బొచ్చు కత్తిరించినతరువాత ఆమనుష్యుడు మంగలిని అడిగెను."

"నావద్ద డబ్బులు లేవు. కాకరకాయలు ఉన్నవి. తీసుకొని వెళ్లెదవా?"

మంగలి:—"నాదృష్టిలో డబ్బులు, కాకరకాయలు రెండును సమానమే." అతడు కాకరకాయలు తీసుకొని ఇంటికి వెళ్ళెను. అతని భార్య కోపముతో "ఇంత ఆలస్యము ఎందుకు చేసితివి? ఇంటిలో కూరలు లేవు. నీకొరకు కనిపెట్టుకొని కూర్చొని ఉంటిని. కూరలు లేనిదే వంట ఏమి చేయుదును?" అనెను,

మంగలి:—ఇదిగో మంచి కాకరకాయలు తెచ్చితిని.

భార్య:—నీవు కాకరకాయలు బాగుచేయుము. నేను మిగిలిన పనులు చేయుదును. మంగలి నెమ్మది నెమ్మదిగా కాకరకాయల పైపెచ్చు గీకుటకు మొదలిడెను.

భార్య:—"ఇటుల చేసిన ఎప్పటికి పని అగును?"

మంగలి:—నాకు మనుష్యుడు, పశువు, కాకరకాయలు అన్నియు సమానమే. మనుష్యునకు మెల్లమెల్లగా క్షౌరము చేసినటు లనే కాకరకాయలుకూడ గీసెదను. నేను సమదర్శిని.

నేను ఆ మంగలివంటి సమదర్శిని, సమవర్తిని అయితిని. ఎక్కడపడితే అక్కడ తినుచు, త్రాగుచు ఉందును.

శ్రీనిత్యానందస్వాములవారు ఫక్కున నవ్విరి. తమరు ఈస్థితిని పొందిన తరువాత ఎక్కడపడితే అక్కడ తినుచున్నారు. ఇప్పటి కాలేజిపిల్లలుకూడ తమవలెనే సమదర్శులును, సమవర్తులును అయి ఉన్నారు. వారు కూడ అభక్ష్యభక్షణము చేయుచున్నారు.

స్వా. ప్రి.:—ఒకమారు అహమదాబాదులో 22, 23 సం।ల యువకుడు వచ్చి అడిగెను. "స్వామీ, ఇంత విశాలప్రపంచములో భేదము ఎందుకు? నేను అడిగితిని. "నీవు భేదమును పాటించుట లేదా?"

అతడు:—లేదండీ.

నేను:—నీకు పెండ్లి అయినదా?

అతడు:—"ఆ, అయినది."

నేను:—"మీ అమ్మగారు ఉన్నారా?"

అతడు:—ఉన్నారు.

నేను:—మీ అమ్మగారి కాళ్ళు ముట్టుకొని నమస్కరింతువా?

అతడు:—తరచు నమస్కరింతును.

నేను:—నీ భార్యకుకూడ అటుల నమస్కారము చేయుదువా?

అతడు మాట్లాడలేదు.

నేను:—"ఇదేమి? తల్లికి నమస్కరించినటుల భార్యకుకూడ నమస్కరించవలెను కదా! నీవు భేదమును ఎందుకు పాటించుచున్నావు!"

ఆతడు సిగ్గుపడెను. ఇప్పటి పిల్లలు పుస్తకములు చదువుచున్నారు. కాని అర్థము తెలుసుకొనుటలేదు. అందుచే అర్థమునకు అనర్థము తెచ్చుచున్నారు. శంకర భగవానుడు ఇట్లు చెప్పెను:—

*భావాద్వైతం సదా కుర్యాత్ క్రియాద్వైతం న కర్హిచిత్ ।*
*అద్వైతం త్రిషు లోకేషు నాద్వైతం గురుణా సహ ॥*

ఎల్లప్పుడు భావమునందు అద్వైతమును కలిగియుండవలెను. కాని క్రియాద్వైతము కూడదు. ప్రతిప్రాణియు భగవత్స్వరూపము. అందరి హృదయములయందు సర్వాంతర్యామియగు పరమాత్మ ఉన్నాడు. ఇట్టి భేదాభావము అద్వైతము అనబడును. కాని గురువుతో అద్వైతమును పొందరాదు. ఆయనకు నమస్కారము చేయవలెను.

స్వా॥ ని॥ :—అద్వైతము, భావమునందు తప్ప క్రియయందు ఎట్లు సంభవము? నోటిలో వ్రేలు పెట్టుకుంటే దానిని కడుగుకొనవలెను గదా! ఇట్లు ఒకశరీరమునందే అద్వైతము లేనప్పుడు మరియొక శరీరముతో అద్వైతము ఎట్లు సంభవము? సర్పవ్యాఘ్రాదులు పరమాత్మస్వరూపములే. కాని పరమాత్మస్వరూపములు కదా అని వానిని కౌగిలించుకొనుటకు వెళ్ళిన చంపివేయును.